## క్లుప్తంగా

### లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం : వల్లెరవారిపల్లెలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైశాఖమాసం మొదటి శనివారం సందర్భంగా స్వామికి ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

### నేడు విగ్రహ ప్రతిష్ట

పోరుమామిళ్ల : రామాయపల్లె ఎంపీపీ పాఠశాలలో ఆదివారం ఉదయం 8:30కి శ్రీ జ్ఞాన సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ, అనంతరం పాఠశాల వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు తుపాకుల శ్రీనివాసులు తెలిపారు. హైకోర్టు అడ్వకేట్ బైరెడ్డి లక్ష్మిరెడ్డి రూ.40 వేలతో ఈ విగ్రహాన్ని చేయించారన్నారు. విగ్రహ ప్రతిష్ట సందర్భంగా విద్యార్థులతో కోలాటాలు, ఏకపాత్రాభినయాలు, కూచిపూడి నాట్యాలు, తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమాలు, మ్యాజిక్ షో తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అన్నదానం జరుగుతుందన్నారు.

### ముగిసిన ధార్మిక కార్యక్రమాలు

బ్రహ్మంగారిమఠం : చౌదరవారిపల్లెలో గత నాలుగు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో ధార్మిక పరిషత్ పరిచారకుడు చాపాటి సుబ్బారెడ్డి రామాయణంపై ప్రవచనలను భక్తులకు వినిపించారు. శుక్రవారం కుంకుమ పూజ, శనివారం కల్యాణంతో కార్యక్రమాలు ముగిశాయని నిర్వాహకులు తెలిపారు. వెంకటరమణారెడ్డి, ఎల్.నారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, వెంకటలక్షుమ్మ, లక్ష్మిదేవి, సిద్దమ్మ పాల్గొన్నారు.

### ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు హర్షం

ప్రొద్దుటూరు : ప్రైవేటు పాఠశాలల గుర్తింపును మూడేళ్ల నుంచి 8 ఏళ్లకు పెంచినందుకుగాను ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నాయని అపుస్మ పట్టణాధ్యక్షుడు కె.దేవీప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డిలకు విన్నవించారని ఆయన పేర్కొన్నారు. ఆ మేరకు శనివారం ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 38ని జారీ చేసిందన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల విన్నపానికి స్పందించి త్వరగా జీఓ జారీ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

### బద్వేలు వాసికి డాక్టరేట్


లక్ష్మిదేవి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో నివసించే చింతంరెడ్డి లక్ష్మిదేవికి యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్(ధార్వాడ్) డాక్టరేట్, గోల్డ్‌మెడల్ ప్రధానం చేస్తూ నోటిఫికేషన్ ద్వారా ప్రకటించారు. ఈమె డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్‌లో ప్రిన్సిపాల్ సైంటిస్ట్ అండ్ హెడ్ ఆఫ్ ది ఇన్‌స్టిట్యూషన్ డాక్టర్ నాగరత్న బిరాదర్ పర్యవేక్షణలో అనాలసీస్ ఆఫ్ ఫీడ్ అండ్ ఫాడర్ స్టేటస్ అండ్ ఫీడ్ బ్యాలెన్స్ షీట్(ప్రోటీన్ అండ్ న్యూట్రియంట్స్)ఇన్ ఇండియా అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించడంతో ఈ అవార్డుకు ఎన్నికయ్యారు. మే నెల చివరి వారంలో జరిగే కాన్వొకేషన్‌లో డాక్టరేట్, గోల్డ్ మెడల్ అందుకోనున్నట్లు ఆమె తెలిపారు.

### ఘనంగా గజ్జపూజ


చెక్కభజన, కోలాట కళాకారులు

పోరుమామిళ్ల : మండలంలోని సిద్దవరం పంచాయతీ చిన్నాయపల్లెలో శనివారం గజ్జపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హంస అవార్డు గ్రహీత భజన పుల్లయ్య పాల్గొని మాట్లాడారు. కళలకు పుట్టినిల్లు రాయలసీమలో చెక్కభజన, కోలాటం, జడకొప్పు భజనలకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. ఈ సాంప్రదాయం ఇప్పటికీ కొనసాగడం హర్షదాయక మన్నారు. కార్యక్రమాల్లో కళాకారులు గానకోకి, నంది అవార్డు గ్రహీత మున్నెల్లి ఓబులేసు, బాలగురయ్య, ప్రసాదరావు, మాచర్ల, చిన్నచెన్నయ్య, పెద్ద చెన్నయ్య, నారాయణ, నాగరాజు, మహిళా కళాకారులు పాల్గొన్నారు.

### ఆటో, మినీ లారీ ఢీ: ఐదుగురికి గాయాలు

మైదుకూరు : పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో శనివారం రాత్రి 11గంటల ప్రాంతంలో ఆటో, మినీ లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఐదుగురు గాయపడ్డారు. పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన వారు మైలవరం మండలంలోని ఆంజనేయస్వామి క్షేత్రానికి వెళ్లి ఆటోలో తిరిగి వస్తున్నారు. ఆటో ప్రొద్దుటూరు రోడ్డులోని కేసీ కాలువ సమీపంలోకి రాగనే ప్రొద్దుటూరు వైపు నుంచి వచ్చిన మినీ లారీ ఢీకొంది. ఆటో పల్టీలు కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న కమలాదేవి,స్వర్ణలత, సాయి లిఖిత, శివప్రసాద్ అనే వారితో పాటు మోక్షిణి అనే రెండేళ్ల బాలుడు గాయపడ్డారు. తాము గాయాలతో హాహాకారాలు చేస్తున్నా మినీ లారీ ఆపకుండా వెళ్లినట్లు బాధితులు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్

- ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు
- కిటకిటలాడి ఈద్గా మైదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : ముస్లింల పవిత్ర పండుగ రంజాన్‌ను శనివారం ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. అల్లాహ్‌ను స్తుతిస్తూ ఒకరికొకరు రంజాన్ ముబారక్ తెలుపుకొన్నారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానానికి చేరుకుని ఉదయం 10.30 గంటలకు ప్రాంతంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ ప్రార్థనలు చేసేందుకు వచ్చిన ముస్లింలతో ఈద్గా మైదానం కిటకిటలాడింది. మైదానంతోపాటు ఆర్‌అండ్‌బీ బంగ్లా, పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ప్రార్థనలు చేశారు. జామియా మసీదు మతగురువు సయ్యద్ అబ్దుల్ మలిక్ నమాజ్ చదివించారు. ప్రతి ఒక్కరు అల్లా చూపిన శాంతి, దయ, సేవా మార్గంలో నడవాలన్నారు. తాము సంపాదించిన దానిలో కొంత పేదలకు ఇచ్చి వారిని ఆదుకోవాలని తెలిపారు. రంజాన్ పండుగ విశిష్టతను, అల్లా గొప్పతనాన్ని, ఖురాన్ పవిత్రతను అందరికి వివరించి, భగవంతుని పట్ల విధేయులై ఉండాలన్నారు. ఖతిబ్ మొబినుద్దీన్ ఉపవాస దీక్షల ప్రాముఖ్యతను వివరించారు. ప్రార్థనల అనంతరం రంజాన్ శుభాకాంక్షలు ఒకరికొకరు తెలుపుకొన్నారు. తాము సంపాదించిన దానిలో శక్తి కొద్ది కొంత పేదలకు ఫిత్రా (దానం) చేశారు. మౌలానా ఇనాయతుల్లా, అంజుమన్ ప్రెసిడెంట్ బాషా, సెక్రటరీ ఇలియాస్ ఖురేషి, జామియా మసీదు ప్రెసిడెంట్ అహ్మద్ హుస్సేన్, పలు మసీదుల కమిటీ ప్రతినిధులు, కౌన్సిలర్ ఇర్ఫాన్, ముస్లిం మతపెద్దలు, పట్టణంతోపాటు పరిసర గ్రామాల ముస్లింలు పాల్గొన్నారు. రంజాన్ సందర్భంగా ఉదయం నుంచి ప్రార్థనలు ముగిసేంత వరకు కొర్రపాడు రోడ్డులో పోలీసులు ట్రాఫిక్ మళ్లించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు.

**రంజాన్ సందర్భంగా అన్నదానం**

ప్రొద్దుటూరు : రంజాన్ సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక గౌతమి మహిళ ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యం ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అమ్మళ్లదిన్నె సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాలేజి డైరెక్టర్ నాగూర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పగిడేల దస్తగిరి, సంచార జాతుల సంఘం నాయకుడు శివకృష్ణ పాల్గొన్నారు.


ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

**బైపాస్ రోడ్డు ఈద్గాలో ప్రార్థనలు**

స్థానిక ఎర్రగుంట్ల బైపాస్‌రోడ్డు సమీపంలో ఉన్న మహ్మదీయ ఈద్గాలో జమాయత్ అహలె హదీస్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా శనివారం ప్రార్థనలు చేశారు. పెద్ద సంఖ్యలో పురుషులతోపాటు మహిళలు ప్రార్థనలో పాల్గొన్నారు. అల్లా గొప్పతనాన్ని, రంజాన్ పండుగ విశిష్టతను మత గురువు వివరించారు. కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానంలో సినీనటుడు దావూద్ రంజాన్ సందర్భంగా ప్రార్థనలు నిర్వహించారు.

**మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ**

రంజాన్ పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఈద్గా వద్ద శనివారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నమాజ్ చేయడానికి వచ్చిన ముస్లింలకు మజ్జిగను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, ద్వార్శల గురునాథ్‌రెడ్డి, జాకీర్ పాల్గొన్నారు.

**ఘనంగా రంజాన్ వేడుకలు**

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లోని ముస్లింలు శనివారం రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈద్గా వద్ద మత గురువు అందించిన సందేశాన్ని విన్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అక్కడున్న నిరాశ్రయులకు తోచినంత దానం చేశారు.

**భక్తి శ్రద్ధలతో రంజాన్**

మైదుకూరు : మైదుకూరు మండలం, మున్సిపాలిటీలో శనివారం రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. మండలంలోని వనిపెంట, జీవీ సత్రం, చౌటపల్లె, భీమలింగాయపల్లె గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మైదుకూరులోని నంద్యాల రోడ్డులో పెద్ద సంఖ్యలో ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని ఈద్గా వద్ద రంజాన్ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఆయన పండ్ల రసాలు, మజ్జిగను అందించారు. తమకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేను మత పెద్దలు, వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం నాయకులు శాలువాలతో సత్కరించారు.


సందేశమిస్తున్న ముబినుద్దీన్

**చాపాడు మండలంలో..**

చాపాడు : మండల వ్యాప్తంగా శనివారం రంజాన్ పర్వదినం పురస్కరించుకుని గ్రామాల్లోని ఈద్గాలలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని చాపాడు, ఖాదరపల్లె, మడూరు, అన్నవరం, పెద్దగురువళూరు, కేతవరం, గుంతచీపాడు, తిమ్మాయపల్లె, రాజుపాళెం ఇంకా పలు గ్రామాలలో ముస్లిం సోదరులు భక్తి భావంతో రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ముస్లిం సోదరులు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

**ఘనంగా ఈద్–ఉల్–ఫితర్**

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ముస్లింలు స్థానిక సిద్దవటం రోడ్డులోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మతగురువు ముఫ్తిఅబ్దుల్‌హాదిమౌలానా రంజాన్ యొక్క పవిత్రతను వివరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముందస్తు జాగ్రత్త చర్యగా అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు, అర్బన్ ఎస్ఐ కత్తి వెంకటరమణలు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**పోరుమామిళ్లలో..**

పోరుమామిళ్ల : స్థానిక ఈద్గాలవద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టైలర్స్ కాలనీవద్ద ఉన్న ఈద్గావద్ద ఇన్సాఫ్ ఆధ్వర్యంలో కర్బూజ ఒప్పులను ముస్లింలకు పంపిణీ చేశారు.


ప్రార్థనలు చేస్తున్న చిన్నారులు


భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు


పోరుమామిళ్లలో ఈద్గావద్ద ముస్లింలకు కర్బూజ ఒప్పులు పంపిణీ చేస్తున్న దృశ్యం


మజ్జిగ పోస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

**భక్తిశ్రద్ధలతో రంజాన్**

కాశినాయన : మండలంలోని నరసాపురం, గొంటువారిపల్లె, వరికుంట్ల, అంబవరం తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి ఈద్‌ముబారక్ చెప్పుకున్నారు. స్నేహితులకు విందు ఇచ్చారు.


చాపాడు: ఈద్గాలో రంజాన్ ప్రార్థనల్లో ముస్లింలు


నరసాపురం ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


మహ్మదీయ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


బద్వేలులోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


మైదుకూరు: పట్టణంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

## శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మాణం

చాపాడు : కేతవరంలోని దూదేకుల కాలనీ వాసులకు చెందిన శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించేందుకు శనివారం భూమిపూజ చేశారు. మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా కేతవరంలోని దూదేకుల కులస్తులు తమ శ్మశాన వాటిక స్థలానికి ప్రహరీ నిర్మించాలని ఎమ్మెల్యేను కోరగా, స్పందించిన ఎమ్మెల్యే రూ.10.50లక్షలతో ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రమోహన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ పాలగిరి వేమారెడ్డి, మాజీ సర్పంచ్ కర్నాటి నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, గంజికుంట చంద్ర, దూదేకుల కాలనీ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

## గాలి, వానతో పంటలకు తీవ్రనష్టం

బ్రహ్మంగారిమఠం : మండలంలో శుక్రవారం రాత్రి గాలి, వాన రావడంతో పలు గ్రామాల్లో మిరప, పత్తి, అరటి, బొప్పాయి, మునగ పంటలు తీవ్రంగా దెబ్బతినట్లు రైతులు తెలుపుతున్నారు. మండలంలో లింగాలదిన్నెపల్లె, చెంచయ్యగారిపల్లె, ఎద్దులాయపల్లె, కేశాపురం, ముడుమాల, చౌదరవారిపల్లె, గొడ్లవీడు వంటి గ్రామాల్లో అధికంగా పంటలు దెబ్బతిన్నాయని రైతులు చెప్పారు. నష్టపోయిన పంటలను అధికారులు పరిశీలించి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూడాలని వారు కోరారు.

**వర్షంతో నేలకొరిగి వరి పంట**

అట్లూరు : మండల పరిధిలో రెడ్డిచెరువుకింద శుక్రవారం రాత్రి గాలివానకు వరిపంట నేలకొరిగింది. పలు గ్రామాలలో సాగులో ఉన్న పత్తి, వరి, మామిడి పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.


గాలివానకు నేలకొరిగిన వరి పంట

## ఘనంగా కడప రాయుడి గ్రామోత్సవం

కడప కల్చరల్ : తిరుమలకు తొలిగడపగా భావిస్తున్న దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ మాసోత్సవాల్లో భాగంగా రెండవ శనివారాన్ని పురస్కరించుకుని తొలుత మూలమూర్తికి, అనంతరం ఉత్సవమూర్తులకు విశేష అభిషేకం, అనంతరం కనుల పండువగా అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను పలు రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పల్లకీపై కొలువుదీర్చారు. భక్తుల జయజయధ్వానాల మధ్య పల్లకీ దేవునికడప మాడవీధుల్లో సాగింది. గ్రామస్తులు వీధికి తరలివచ్చిన కడప రాయుడిని దర్శించుకుని పూజా ద్రవ్యాలు సమర్పించి ప్రార్థనలు చేశారు. అర్చకులు వారికి హారతులు, తీర్థప్రసాదాలు అందజేశారు. అర్చకులు త్రివిక్రమ్, మయూరం కృష్ణమోహన్ ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇతర కార్యక్రమాలు నిర్వహించారు.



## అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కిస్తున్నాం

- టీడీపీ హయాంలో మైదుకూరు మునిసిపాలిటీకి చేసింది శూన్యం
- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందనిపిస్తేనే ఇళ్లకు జగనన్న స్టిక్కర్ అతికించుకోవాలని, ఇందులో బలవంతమేమీ లేదని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. మైదుకూరు పట్టణంలోని చాకలి వీధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.9లక్షలతో చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సీఎం వైఎస్ జగన్ ఇప్పటి వరకు రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి వివిధ పథకాల ద్వారా రూ.2లక్షల కోట్లు లబ్ధి చేకూర్చారని తెలిపారు. అందుకే నేడు ప్రతి ఇంటి యజమాని 'మా నమ్మకం నువ్వే జగనన్న' స్టిక్కర్‌ను సంతోషంగా తమ ఇంటికి అతికించమని కోరుతున్నారని తెలిపారు.

**పరుగులు పెట్టనున్న మున్సిపాలిటీ అభివృద్ధి**

మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధి పరుగులు పెట్టనుందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని గ్రామాల్లో ఎప్పుడో పాతికేళ్ల కిందట రోడ్లు వేశారన్నారు. ఇప్పుడు తాము రూ.19 కోట్లతో బీటీ రోడ్లు, రూ.16 కోట్లతో డ్రెయిన్స్ నిర్మించనున్నామన్నారు. టీడీపీ హయాంలో పీహెచ్‌సీ మాత్రమే ఉండేదని, తాము 30 పడకల ఆస్పత్రిగా మార్చి, ప్రస్తుతం వంద పడకల ఏరియా ఆస్పత్రిగా మారుస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజికి ఐదు ఎకరాల్లో రూ.11 కోట్లతో సొంత భవనాలను నిర్మించనున్నామని అన్నారు. పాలిటెక్నిక్ కాలేజీ, రాయలసీమలో ఎక్కడా లేని విధంగా ఆరు బ్రాంచిలతో ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. పశువుల సంత స్థలంలో రూ.90 లక్షలతో రైతు బజార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. పశువుల సంత గగ్గి తిప్ప వద్దకు మార్చాక ఆదాయం మరింత పెరిగిందన్నారు. ఇదంతా అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మైదుకూరు అభివృద్ధిల్లో కొత్త పుంతలు తొక్కిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తాము మైదుకూరు అభివృద్ధికి రూ.900 కోట్లు ఖర్చు చేశామని టీడీపీ నాయకులు చెబుతున్నారని, ఎక్కడ ఖర్చు చేశారో చెప్పాలన్నారు. బహుశా నీరు – చెట్టు కింద ఖర్చు చేసి ఉంటారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణ, మున్సిపల్ ఏఈ నిరంజన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, మహిళా అధ్యక్షురాలు కిరణ్మయి, మున్సిపల్ వైస్ చైర్మన్లు షరీఫ్, భారత్‌కుమార్, ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, గుడిపాడు బాబు, బీఎస్ రఘురామయ్య, భూమిరెడ్డి సుబ్బరాయుడు, కో–ఆప్షన్ గౌస్, జమాల్, ఖాదర్, వీరభద్రుడు, బీఎస్ కిట్టు, రేనాటి, గోశెట్టి లక్షుమయ్య, షౌకత్ ఆలీ, గడ్డమాయపల్లె రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

## ఎట్టకేలకు ఉప్పరపల్లె గ్రామానికి తారు రోడ్డు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండల సరిహద్దులోని ఉప్పరపల్లె గ్రామానికి ఎట్టకేలకు తారు రోడ్డును నిర్మించారు. దీంతో గ్రామ ప్రజలు సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చివరగా ఉన్న ఈ గ్రామానికి సంబంధించిన రోడ్డు నిర్మాణం పట్ల గతంలో పాలకులతోపాటు అధికారులు కూడా నిర్లక్ష్యం వహించారు. సుమారు 5వేలు జనాభా గల ఈ గ్రామం మైదుకూరు హైవే రోడ్డుకు ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామం మీదుగా వయా మడూరు, అన్నవరం, గుడిపాడు గ్రామాలకు వెళ్లవచ్చు. పూర్వం కేవలం మెటల్ రోడ్డు మాత్రమే ఇక్కడ ఉండేది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2006లో తొలిమారు గ్రామానికి తారు రోడ్డు నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు కొత్త రోడ్డు నిర్మించకపోగా ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ సమస్య కారణంగా ద్విచక్ర వాహనదారులతోపాటు నాలుగు చక్రాల వాహన యజమానులు నానా అగచాట్లు పడేవారు. వరిపంట సీజన్‌లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సంబంధిత అధికారులను పిలిపించి తప్పకుండా రోడ్డు నిర్మించాలని కోరారు. ఈ మేరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధుల ద్వారా రూ.52 లక్షలు మంజూరు చేయించారు. ఒకటిన్నర కిలోమీటర్ రోడ్డును 20 అడుగుల వెడల్పుతో నిర్మించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ డీఈ మల్లేశ్వర రెడ్డి మాట్లాడుతూ శనివారం ప్రారంభమైన రోడ్డు నిర్మాణం ఆదివారానికి పూర్తవుతుందన్నారు.


ఉప్పరపల్లెకు నిర్మించిన రోడ్డు

**చాలా సంతోషంగా ఉంది**



ఇంత కాలం తర్వాత తమ గ్రామ పంచాయతీకి తారు రోడ్డు నిర్మించారు. గతంలో ప్రభుత్వాలు తమ గ్రామాన్ని పట్టించుకోలేదు. సమస్యను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి పరిష్కరించారు. రోడ్డు నిర్మాణం పట్ల ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– రమణారెడ్డి, సర్పంచ్, ఉప్పరపల్లె